# 7వ పుష్పము

## 7. ఓం శ్రీ సాధువర్ధనాయ నమః

1) నామ పారాయణ ప్రియుడు :

సాధుత్వ లక్షణము - సద్గుణములు, నైతిక శక్తి, ధార్మిక వర్తనము, పరిపూర్ణత్వము. సాధువు అంటే “న్యాయ ప్రవృత్తతయా సాధుః = న్యాయ ప్రవృత్తి గలవాడు సాధువు. “సాధయతీతి వా సాధుః” = న్యాయమును సాధించు వాడు సాధువు. “సాధ్యభేదాను పాదా దానాత్ సాధుః” = న్యాయ ప్రవృత్తి సాధ్యమాత్ర సాధకుడు సాధువు. వర్ధయతి పర్ధనః = వృద్ధి చేయువాడు వర్ధనుడు. ప్రపంచ రూపేణ వర్ధతయితి వర్ధమాన = ప్రపంచమును వృద్ధి చేయువాడు వర్ధనుడు. అటువంటి సాధు గుణములను ప్రపంచంలో వృద్ధి చేయువాడు కాన స్వామి సాధు వర్ధనుడు, అట్టి స్వామికి నమస్కారము.

2) కవీశ్వరుడు

స్వామి దివ్యవాణి “పోయేటప్పుడు పట్టుకుపోయేది లేదు”, ఇట్లా వినిపిస్తుంది.

ప॥ నిరత సత్యప్రౌఢి ధరణినేలిన హరిశ్చంద్రుడే ధరబాసి చనగ లేదే
ఎల్లలోకములేలి యెసగిన నలరాజు తనవెంట భూమిని గినుచుకొనెనె
కృతయుగంబునకు అలంకృతము చేయు మాంధాత సిరిగట్టుక అరుగజనెనె
జలధిసేతువు గట్టి అలనాడు శ్రీరాము ఇప్పడుర్విపై నున్న వాడే
ఎందరు రాజులు ఏగినారు ఒక్కరును వెంటగొని పోలేవుర్వితలము
మీరు మాత్రము మీదు విద్యయు ధనము తలకుగట్టుకు పోవుదురా ధర్మహృదయ

ఈ విషయాన్ని గూర్చి ఒక చక్కని అఖ్యాయిక (కథ) కఠోపనిషత్తులో చెప్పబడినది. తండ్రి ఆజ్ఞ ప్రకారము నచికేతుడు యమలోకమునకు బోయి యమధర్మరాజుచే రెండు వరములు పొంది మూడవ వరము ఈ ప్రశ్న అడిగాడు. “మానవుడు చనిపోయిన తర్వాత కొందరు ఏమీ వుండదు అంటారు. మరికొందరు దేహభిన్నమగు ఆత్మ అనేది వుంటుంది అంటారు. ఇందు ఏది సత్యము? ఇదియే మూడవ వరము” అని అడుగుతాడు. యముడు యిది దేవతలకు కూడా తెలియదు. ఆ ప్రశ్న తప్ప యింకా ఏమైనా అడగమంటాడు. పుత్రులను, పౌత్రులను, పశుసంపదను, గుర్రములు, ఏనుగులు, బంగారము, దేవకన్యలు, సార్వభౌమత్వము యిస్తానని ప్రలోభ పెడతాడు. నచికేతుడు చలించలేదు. నిశ్చలుడై ఇట్లా అన్నాడు. “ఎంత ఆయుర్ధాయమున్నా, ఎన్ని అనుభవించినా అవి అన్నియు అనిత్యములు. చివరకు నీ దగ్గరకు రాక తప్పదు కదా! అందుచే ఆత్మ విజ్ఞానమునే నాకు బోధించు జీవితము అల్పం, బ్రహ్మ ఆయుష్షు కూడా అల్పమే కదా! అన్నారు.

మం॥ శ్వోభావా మర్త్యస్య, యదంత కైత
త్సర్వేంద్రియాణాం జరయంతి తేజః ।
అపి సర్వం జీవిత మల్పమేవ
తవైవ వాహా స్తవనృత్యగీతేః ॥ (1-1-26)

అందుచే ఎటువంటి వారికైనా మరణం తప్పదు.

3) సకలతత్త్వ బోధకుడు - కదిలే మేఘాలు

స్వామి సంసారమును గురించిన దివ్యబోధ. సంసారము కదిలే మేఘాల వంటిది అని అంటారు. “పెండ్లికి ముందు భార్య ఎవరు? భర్త ఎవరు? బాటసారి చెట్టుక్రింద నీడలో కూర్చొన్నట్లు కొంతకాలము కలసియుండవచ్చును. తరువాత విడిపోవచ్చును. ఈ సంబంధాలు కదిలే మేఘాలవంటివి. ఒక బాటసారి అలసిపోయి ఒక చెట్టు నీడను కూర్చున్నాడు. అతడు హాయి అనుభవిస్తున్నాడు. కాని చెట్టుకు మాత్రము తన నీడను అనుభవిస్తున్నాడనే

గర్వము గాని, అహంకారము గాని ఎంతమాత్రము లేదు. నీడ ఇవ్వడం చెట్టు సహజ గుణము. కానీ ఏ కోశానా అహంకారము లేని చెట్టు, ఎప్పడూ ఆనందముగానే యుంటుంది. జీవిత వృక్షమనే భార్యాపిల్లలు, తన నీడను, తన రక్షణలో వుంటున్నారనే అభిమానము, అహంకారము ఉండుటవల్ల "నాకు దుఃఖము కలుగుతోంది" అని అనుకుంటాడు. మార్గమధ్యంలో ఏర్పడ్డ సంబంధాలు యివన్నీ. యివన్నీ కొంతసేపు విశ్రమించిన తరువత వెళ్ళి పోతాడు.

4) సర్వజ్ఞుడు

ఇటువంటివి రైలు ప్రయాణ స్నేహలు, తాత్కాలపు అనుభవాలు ఎట్లా వుంటాయో శ్రీ శంకరులు వర్ణించారు. భజ గోవింద శ్లోకములలో.

శ్లో॥ కాతేకాన్తా కస్తేపుత్ర సంసారో యమతీవ విచిత్రః ।
కస్యత్వం వాకుత ఆయ తత్త్వచింతయ తదిమ భ్రాంతిః ॥

తా॥ ఓయీ! నీకు ఈ భార్య ఎక్కడిది? నీ భార్యా అనుకునే ముందు ఏమైనా ప్రేమ సంబంధమున్నదా? నీకు కొడుకు అనగా నెవరు? నీవెవ్వడవు? ఎచటి నుండి వచ్చితివో తెలిసికోగలవా? ఇట్లే సంసారము నందలి ప్రతి విషయము భ్రాంతి కల్పితములే? అహంకార మమకారాది భావముతో కూడియున్నది. ఓయన్నా నామాట విని నిజము తరచి తెలిసికొన ప్రయత్నింపుము. వారిలో ఒక్కరికైనా, లేక మాత్రమైనా సంబంధమున్నదేమో చూడుము చక్కగా విచారించినచో నేదియును కానరాదు.

శ్రీ సురేశ్వరాచార్యులు (శ్రీ శంకరుని శిష్యులు) యిట్లా అన్నారు.

శ్లో॥ కస్త్వం కోహం కుత ఆయాతః కా మే జననీ కో మే తాతః
ఇతి పరిభావిత నిజసంసార సర్వత్యక్త్వా స్వప్న విచారః ॥

తా॥ నీవెవ్వడవు? నేనన నెవ్వడను? నీవు నేను ఇర్వురము ఎచ్చట నుండి వచ్చినాము? నాకు తల్లి ఎవతె? నాకు తండ్రి ఎవ్వడు? ఈ లాగున పరామర్శించిన యెడల స్వీయమగునట్టి దేహేంద్రియాది సంసారము గల వాడవై ఈ సర్వమును గురించి స్వప్నావస్థయందు ఏరీతి, నివి యన్నియు కల్పితములు, నసత్యములు. వీనికెల్లా సాక్షిభూతుడనైన నేనొకడను వెల్గుచుంటినను విచారమెద్ది గలదో అట్టి విచారము గలవాడవై ఆసద్వస్తువుల ఎందైన అభిమానమంతయు పరిత్యజించి బహువిధ బేధ, పరిదృశ్యమాన, మృత్తిక, ఏ రీతిగ కాలత్రయమునందు బంధింపబడక వెల్గునొందుచున్నదో, అట్లనే సర్వజగద్వస్తు సముదాయమందు - త్రికాల ఆరాధ్యుడై బహువిధ భేద పరిదృశ్యమానుండై యలరు గోవిందుని పొందుము. అనగా దేహేంద్రియాదులు ద్రష్టలు గావని, వీనినెల్లా వీక్షించు ద్రష్ట వేరొకడై యున్నాడనియు, ఆ పదార్థమే నేననియు తెలిసి వాటికి అతీతుడగు నాకు తల్లిదండ్రులు ఎవ్వరనియు, నెరింగి కల్పిత నామరూపములను స్వప్నప్రాయములుగా దలంచి సర్వపరిపూర్ణుడగు నా గోవిందుని బొందుము.

5) ప్రేమ స్వరూపుడు

"యువతరకాలమే దైవత్వము నందుకొనుటకు స్వర్ణయుగము - ప్రతి మానవుని యందు ప్రేమ అంతో యింతో ప్రసరిస్తూనే యుంటుంది. పరమప్రేమ స్వరూపుడైన పరమాత్మునియందు జీవుడు అంశముగా ఆవిర్భ విస్తున్నాడు. కనుక మానవుడు కూడా ప్రేమస్వరూపుడే, కాని మానవుని ప్రేమ ప్రాకృత మార్గంలో ప్రవహించడం చేత మలినమవుతున్నది. మాలిన్యంతో నిండియుండుటవల్ల ఆ ప్రేమ రసము నందు భగవంతుని సుందర ముఖా రవిందము స్పష్టముగా కనిపించదు. అఖండమైన ప్రేమతో పరమాత్ముని ప్రేమించడమే భక్తియని నారదుల భావం. ఆరాధనలు, అర్చనల యందు ప్రేమ అనురక్తి కలిగినదే భక్తియని వ్యాసులవారి భావము - త్రికరణ శుద్ధితో సేవలు గావించి, అర్పితం గావించే చిత్తం, భక్తియని గార్గి ఋషి అభిప్రాయం. మనసును అదుపులో వుంచుకొని భగవంతుని వైపు మరలిచ దివ్యమైన ఆనందాన్ని అనుభవించడమే భక్తియని యాజ్ఞవల్క్యుని భావం. చిత్తమును

ఆత్మవైపు మరల్చి ఏకాత్మమైన ఆనందాన్ని అనుభవించడమే భక్తియని అనేకమంది మహనీయులు అనేక విధము లుగా బోధించినప్పటికినీ ప్రధానమైనది ప్రేమ మాత్రమే.

దివ్యలీల : అట్టి దివ్య పూర్ణ ప్రేమ స్వరూపుడు మాత్రమే. ఒకే వృక్షం మీద అనేక రకాల ఫలాలను సృష్టించి భక్తులకు యివ్వగలిగినాడు. భక్తవత్సలుడు అట్టి స్వామియే భక్తుల సేవకుడయినాడు. పుండలీకుడు తల్లిదండ్రుల సేవచేస్తూ వుండగా, పాండురంగడు పరీక్ష చేయడానికి రాగా, "నా సేవ పూర్తి అయ్యేదాకా ఆ యిటుక రాయిపై నిలుచో అని భగవంతుని ఆజ్ఞాపింపగలిగాడు.

దివ్యచికిత్స : అట్టి ప్రేమమూర్తియే శ్రీ దీక్షితుని చెల్లెలు సాయమ్మ రొమ్ము కాన్సరును కాన్సిల్ (cancel)చెయ్య గలిగారు.

6) సకల జనప్రియుడు : శాశ్వత ఆనందదాయి
(శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి)

ప॥ నీ పల్కులో సర్వనిగమాంతసారంబు తేటతెల్లముగా తెలియుచుండు
నీ చూపులో మనేక జన్మార్జిత కర్మఫలంబెల్ల కలుగుచుండు
నీ పిల్పులో షడింద్రియ గోచరముగాని, ఆధ్యాత్మిక వివేకబమబ్బుచుండు
నీ పాటలో సుధానిషంద నిర్మలా స్తిత్యభావము మాకు చెందుచుండు
నిన్ను స్మరించుచు భవరోగముల జయించి నీ పాద స్పర్శచే పాపనిచయము తెగి
ధన్యజీవులగుచు, సత్యమ్ము సుమ్మి శాశ్వతానందదాయి శ్రీ సత్యసాయి

ప॥ సంకల్పమాత్రాన క్షణంబులో సృష్టించి వివిధ వస్తువులు యిత్తువు జనులకు
నీ కృపామృతముచే భీకర రోగార్తి బాసి స్వాస్థ్యము నరుల్ వడయగలరు
ఏకకాలమున యనేక ప్రదేశాల ప్రత్యక్షమై తృప్తిపరతువు మమ్ము
సంశయంబులెంత క్లిష్టంబైన సులబముగా బాపగలవు నీవు
అన్నిటిన్ మించి దశ దేశాంతరముల లక్షలన్ కోట్ల జనాలను యుల్లమందు
విమల పరిశక నంబోదలించినావు శాశ్వతానందదాయి శ్రీ సత్యసాయి

7) స్తుతి ప్రియుడు

స్వామి నామస్మరణ గురించి యిట్లా అన్నారు. "తనలో నివసించే పరమాత్మను గురించి నిత్యానందమును పొందవలెననిన నామస్మరణము అత్యవసరము. "శబ్దమే బ్రహ్మస్వరూపము" మంత్రోచ్ఛారణ వలన, నామస్మరణ వలన, నామసంకీర్తన వలన శ్రేష్ఠ ఫలము లభించును. పరమాత్మను సులభముగా కట్టివేయగలది ఒక నామము నామస్మరణతో పరమాత్మను పొందవచ్చును. పరమాత్మలోనే లీనంకావచ్చును."

దివ్యభజన : పావన పావన సాయిరాం ।
భజోనిరంతర సాయిరాం ॥సా॥
భక్తిభావనే భజన సునావో
గురుచరణో మే ధ్యాన లగావో
సాయిచరణో మే ధ్యాన లగావో ॥సా॥

8) వేదాంతవేద్యుడు

వేదవేద్యుడు - కఠోపనిషత్తు యింకా ఏమి చెప్పింది?

మం॥ య ఏషసుప్తేషు జాగర్తి కామం కామం పురుషో నిర్మిమానే
తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృత ముచ్యతే ॥ (2-2-3)
తస్మిఁల్లోకా శ్రతాస్సర్వే తదునాన్యేతి కశ్చన ఏత ద్వైతత్ ॥

తా॥ అంతఃకరణ వ్యతిరిక్తములగు ప్రాణాది ఇంద్రియములు నిద్రించుచుండగా తాను (ఆత్మ) మాత్రము

నిద్రింపక జాగరూకుడై అవిద్యచేత స్రక్చందన వనితాది అభీష్టజాతమును, ఏ పురుషుడు నిర్మించుచున్నాడో, అతడే పరిశుద్ధమైనట్టియు, నిగూఢమైనట్టియు, పరబ్రహ్మము సాయిపరమేశ్వరుడు. ఇంతకంటె భిన్నముగా బ్రహ్మమనేది లేదు. ఇదియే అమృతము, అనగా నాశరహితమని, సర్వశాస్త్రములందు చెప్పబడుచున్నది. పృథివ్యాది సకల లోకములు, సర్వలోకములకు కారణభూతుడగు ఆ బ్రహ్మమునందే ఆశ్రయించి యున్నవి. అట్టి బ్రహ్మము కంటె కంటె భిన్నముగ నుండునట్టి వస్తువే లేదు. ఇదియే నాచికేతుడడిగిన బ్రహ్మము.

మం॥ అగ్నిర్య థైతో భువనంప్రవిష్టో రూపం రూపం ప్రతిరూపో బభూవ
ఏకస్తథా సర్వభూతాంతరాత్మ రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ ॥

(2-2-3)

మం॥ వాయుర్యథైకో భువనం ప్రతిష్టో రూపం రూపం ప్రతిరూపో బభూవ
ఏక స్తథా సర్వభూతాంతరాత్మ రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ॥

(2-2-10)

తా॥ అగ్నియు, వాయువు ఒక్కరే, బయట, లోపల ప్రవేశించి ఆయా రూపములకు తగినట్లుగా, రూపములను చెందుతున్నారు. ఉన్నది ఒక్కటే ఆత్మ లేక సాయి పరమేశ్వరుడు.

**ఓం తత్సత్**